సాక్షి నిజామాబాద్

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



పార్టీ కార్యకర్తలే నా బలగం

నా బలం సీఎం కేసీఆర్ అయితే.. పార్టీ కార్యకర్తలు నా బలగం అని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

- 8లో ▸



రోడ్డు ప్రమాదాల్లో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శనివారం వేరువేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృత్యువాతపడ్డారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.4 /20.0

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

21,595 మంది విద్యార్థుల హాజరు

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

నిజామాబాద్‌సిటీ: జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం 138 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 21,672 మంది విద్యార్థులకు గాను 21,595 మంది హాజరయ్యారు. 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎనిమిది పరీక్ష కేంద్రాలను, అబ్జర్వర్లు మూడు, ప్రత్యేక బృందాలు 43 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: ఆయకట్టు అవసరాలకోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి శనివారం ప్రధాన కాలువకు ఏడో విడత నీటి విడుదల చేపట్టారు. అలీసాగర్ రిజర్వాయర్ వరకు సాగు చేస్తున్న పంట పొలాలను గట్టెక్కించడం లక్ష్యంగా ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు ఆరు విడతల్లో నీటిని విడుదల చేశామని ప్రాజెక్టు డిప్యూటీ ఈఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 1,200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఆయకట్టు ప్రాంత రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలి




ఆర్మూర్‌టౌన్: ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఆదరించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఉషాదేవి అన్నారు. ఆర్మూర్‌లోని ఆర్టీసీ డిపోలో శనివారం ఎక్స్‌ప్రెస్ స్థానంలో కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులను ఉషాదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యం కోసం నూతన బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సుల్లో ఎయిర్ సస్పెన్షన్, కుదుపు లేని ప్రయాణం, పుష్‌బ్యాక్ సీట్లు, ఆడియో, వీడియో సౌకర్యం ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు సురక్షితమైన ప్రయాణం చేయవచ్చన్నారు. డిపో మేనేజర్ కవిత, గంగాకిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వాలు అందజేస్తే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళా ప్రాంగణంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన పథకంలో భాగంగా 62మంది మహిళలకు ఐటీ రంగంలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్న 33 మందికి హైదరాబాద్‌కు చెందిన జస్ట్ డయల్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించారు. ఈసందర్భంగా ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆకుల లలిత ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగాలు సాధించిన వారు నిరుద్యోగ యువతకు ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, ఉద్యోగావకాశాల గురించి తెలియజేయాలని సూచించారు. ప్రాంగణం మేనేజరు పద్మ, అకౌంటెంట్ రాజశ్రీ, జూనియర్ అసిస్టెంట్ రామ్ మనోహర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ కోట

ఊరికో చరిత్ర..

- పాలకుల పేర్లతో ఊళ్లు
- స్థల ప్రాధాన్యతను బట్టి నామకరణం
- తరచిచూస్తే చారిత్రక విశేషాలెన్నో..

సండే స్పెషల్

కామారెడ్డి జిల్లా చారిత్రకంగా, భౌగోళికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ప్రాంతం.. భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం.. విభిన్న జాతులు, మతాలు, కులాలకు నెలవైన జిల్లాకు ఎగువన కౌలాస్ కోట, దిగువన దోమకొండ గడికోట.. నడుమ విశాలంగా ప్రవహించే మంజీర నది. దానిపై నిజాం ప్రభువు నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు. మెతుకు సీమకు సరిహద్దుల్లో పోచారం ప్రాజెక్టు, అభయారణ్యం.. వాగులు, వంకలు, గొలుసు చెరువులతో పచ్చని పంటలకు నిలయమైన ఈ ప్రాంతంలో ఒక్కో ఊరుకు ఒక్కో చరిత్ర ఉంది. దీనిపై సండే స్పెషల్..

– సాక్షి, కామారెడ్డి

- వివరాలు 8లో..

మళ్లీ వాన దెబ్బ

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం, మక్క, పసుపు పంటలు
- చేతికొచ్చాక పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతన్నలు
- నష్టం అంచనా వేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఒకే ఒక్క కొనుగోలు కేంద్రం ప్రారంభం

అందరికీ అన్నం పెట్టే రైతన్నకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆరుగాలం పండించే పంటను జాగ్రత్తగా కాపాడుకుని తీసిన దిగుబడి వర్షం పాలవుతోంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పంట చేతికొచ్చే ఈ సమయంలో వరుసగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోతున్నారు. పదిహేను రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా జిల్లాలో పలువురు రైతుల పంటలు దెబ్బతిన్నాయి. మళ్లీ శనివారం కురిసిన వర్షంతో పలుచోట్ల ఆరబోసిన ధాన్యం, మక్కలు, పసుపు పంటలు తడిసిపోయాయి.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని కోటగిరి, బోధన్, వర్ని, రుద్రూర్, నందిపేట, ఆలూర్, మాక్లూర్, ఎడపల్లి, ముప్కాల్ మండలాల్లో వర్షం కురిసింది. బోధన్, కోటగిరి మండలాల్లో వరి పంట చేలల్లోనే నేలకొరిగింది. జిల్లాలో 300 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నిజామాబాద్ మార్కెట్ యార్డులో అమ్మకం కోసం తీసుకొచ్చిన పసుపు కుప్పలు, బస్తాలు తడిసిపోయాయి. తొమ్మిది నెలల పాటు కష్టపడి సాగు చేసిన పసుపు వర్షార్పణం కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. మరోవైపు జిల్లాలోని పలు మండలాల్లో ఆరబెట్టిన ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. రుద్రూర్ మండలం లింగంపల్లిలో వరి పైరు నేలకొరిగింది. రానంపల్లిలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఎడపల్లి మండల కేంద్రంలో, ఆలూరు మండలం దీకంపల్లిలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. ముప్కాల్ మండల కేంద్రంలో ఆరబోసిన మొక్కజొన్న తడిసింది. ఇదిలా ఉండగా రెండువారాల క్రితం మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి సైతం పంటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షానికి జిల్లాలో సుమారు 1,700 ఎకరాల్లో వరి, 250 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. భీమ్‌గల్, ధర్పల్లి మండలాల్లో వరి, నందిపేట, ముప్కాల్, బాల్కొండ, మోస్రా ఎడపల్లి మండలాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. అయితే పంట నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా మళ్లీ తాజాగా అకాల వర్షంతో రైతులు మరోసారి నష్టపోయారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం పంట నష్టం అంచనా వేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పొలాల్లో దెబ్బతిన్న పంటలు తప్ప కోసిన తర్వాత నష్టపోయిన పంటలను అధికారులు పరిగణనలోకి తీసుకోకపోతుండడం సరికాదని రైతులు అంటున్నారు. అయితే జిల్లాలో ఒకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం గమనార్హం.



నిజామాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన పసుపు

“ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంవల్లే..



అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నేను మూడెకరాల్లో వరి సాగు చేశా. రెండు రోజుల క్రితమే పంట కోసి ఆరబెట్టేందుకు కల్లాలకు తీసుకొచ్చా. వర్షం వల్ల టార్పాలిన్లు కప్పినప్పటికీ ధాన్యం తడిసిపోయింది. మళ్లీ ఎండబోయాల్సిన పరిస్థితి నెలకొంది. ధాన్యం ఆరిన వెంటనే అమ్ముదామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. – నరేందర్, రైతు, దీకంపల్లి



రుద్రూర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు



ఎడపల్లిలో వర్షం నీటి నుంచి వరి ధాన్యాన్ని తీస్తున్న మహిళా రైతులు

మరో రకం బాదుడు!

సిరికొండ మండల కేంద్రంలో ఓ వినియోగదారుడి బిల్లులో రూ. 114 ఏరియర్ చెల్లించాలని వచ్చింది. ఇదేమిటని ఆందోళన చెందిన వినియోగదారుడు వెంటనే ఈ విషయాన్ని పరిశీలించాలని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

జిల్లా కేంద్రంలోని మరో వినియోగదారుడికి రూ. 1,385 ఏరియర్స్ కట్టాలని బిల్లులో ఇచ్చారు. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నాడు. ఇలా జిల్లాలో ఎంతో మందికి ఏరియర్స్ పేరిట బిల్లు వచ్చినట్లు సమాచారం.

- విద్యుత్‌శాఖలో ఏరియర్స్ పేరిట వసూలు!
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో మరో రకం బాదుడు షురూ అయ్యింది. ఇది వరకే డెవలప్‌మెంట్, ఏసీడీ పేరుతో చార్జీలు వసూలు చేసిన ఆ శాఖ.. ప్రస్తుతం ఏరియర్స్‌పై పేరిట వసూలు చేస్తున్నారు. అయితే గతంలో డెవలప్‌మెంట్, ఏసీడీ పేరుతో చార్జీలు వసూలు చేయగా వినియోగదారుల నుంచి సర్వత్రా విమర్శలు రావడంతో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు వెనక్కి తగ్గారు. తాజాగా ఏరియర్స్ పేరుతో వసూలు చేస్తుండడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

జిల్లాలో ఇలా..

నిజామాబాద్ జిల్లాలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. ఇందులో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ డివిజన్లున్నాయి. మొత్తం 5,38,951 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినెలా రూ. 32,27,33,000 విద్యుత్ బిల్లులు వసూలు కావాల్సి ఉంటుంది. గతంలో డెవలప్‌మెంట్ చార్జీలంటూ బిల్లులు వసూళ్లు చేశారు. వినియోగదారులు, ప్రజా సంఘాల నుంచి విమర్శలు రావడంతో వెనక్కి తగ్గారు. ఇటీవల ఏసీడీ పేరుతో మళ్లీ వసూలు చేసే ప్రయత్నం చేశారు. వినియోగదారులు, ప్రజా సంఘాలు రోడ్డెక్కడంతో నిలిపివేశారు. తాజాగా ఏరియర్స్ పేరుతో చార్జీలు బిల్లులో వేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

“ పాత బిల్లులో తక్కువ కడితే..

గత నెలలో, అంతకుముందు వినియోగదారుడి మొత్తం బిల్లులో తక్కువ కడితే అవి ఏరియర్స్ పేరుతో ఇప్పుడు వస్తున్నాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏవైనా అభ్యంతరాలుంటే నేరుగా విద్యుత్ కార్యాలయాల్లో సంప్రదించి బిల్లులో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవాలి.

– రవీందర్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ

అనుమానాలను నివృత్తి చేయాలి



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

- ఆ బాధ్యత మంత్రి, ఎంపీదే..!
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: జాతీయ రహదారి – 63 విస్తరణపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌దేనని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కమ్మర్‌పల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఆర్మూర్(పెర్కిట్) నుంచి మంచిర్యాల వరకు జాతీయ రహదారి విస్తరణ కోసం భూసేకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పత్రికా ప్రకటన ప్రజలను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఈనేపథ్యంలో రహదారి విస్తరణ గ్రామం నుంచే ఉంటుందా, లేక గ్రామం బయటి నుంచి ఉంటుందా అనే విషయాలను స్పష్టం చేయాలన్నారు. కమ్మర్‌పల్లిలో ప్రస్తుతం రోడ్డు డివైడర్ పనులు కొనసాగుతున్నాయని, ఇకపై రోడ్డు సమస్య ఉండకపోవచ్చనే అభిప్రాయంతో ఉన్న గ్రామస్తులకు ఉపద్రవం వచ్చిపడినట్లు భూసేకరణ ప్రకటన వెలువడడం మరింత భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. సంబంధిత శాఖ మంత్రిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధిగా ఉన్న ఎంపీ అర్వింద్ మానవతా దృక్పథంతో నిజాలను దాచకుండా ప్రజల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, ఏర్గట్ల మండలాధ్యక్షుడు సోమ దేవారెడ్డి, నాయకులు బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంధర్‌ప్రసాద్, సల్లూరి గణేష్‌గౌడ్, జగదీష్, ప్రదీప్, రంజిత్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం.. సరోజనమ్మ సేవా దృక్పథం..!

- రూ. 20 లక్షలతో 'ధర్మ స్థలం' భవన నిర్మాణం
- సొంత ఇల్లు పెన్షనర్స్ అసోసియేషన్‌కు అప్పగింత
- పేదలకు వైద్యం కోసం పెన్షన్ సొమ్ము వినియోగం



హైదరాబాద్‌లో సరోజనమ్మను సత్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ (ఫైల్)

బోధన్: బోధన్ పట్టణానికి చెందిన 84 ఏళ్లకు పైబడిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ సేవా దృక్పథం.. స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సొంత ఇంటిని పెన్షనర్స్ అసోసియేషన్‌కు ఇవ్వగా.. పెన్షన్ సొమ్మునూ నిరుపేదల వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. అంత్యక్రియల కోసం పేదల ఇబ్బందులను చూసి పట్టణ శివారులోని చెక్కి చెరువు పరిసర ప్రాంతంలో సొంత డబ్బులు రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టిన ధర్మ స్థలం భవనం నిర్మించారు. ఈ నెల 10న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ కుల, మతాలకతీతంగా నిరుపేదలు, నిరాశ్రయుల కుటుంబ సభ్యుడి అంతిమ సంస్కారాలు వారి సంప్రదాయాల మేరకు నిర్వహించుకునేందుకు ఉచిత సౌకర్యం కల్పిస్తారు. ఇందులో ఫ్రీజర్, కరెంట్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. మరుగుదొడ్డి, స్నానానికి గదులు నిర్మించారు.

ఉద్యోగ విరమణానంతరం..

సరోజనమ్మ 1996లో ఉద్యోగవిరమణ పొందారు. ఆమె భర్త వెంకట్రావ్ 2013లో మృతి చెందారు. వీరికి సంతానం లేదు. స్థానిక గోశాల రోడ్డులో 180 గజాల విస్తీర్ణంలో గల రూ. కోటికి పైగా విలువ చేసే సొంత ఇంటిని తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు సామాజిక సేవల కోసం దానం చేశారు. నెలసరి వచ్చే పింఛన్ కూడా కొంత అవసరాలకు ఉంచుకుని మిగిలిన సొమ్మును నిరుపేదల వైద్య చికిత్సల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇలా అనేక స్వచ్ఛంద సేవలు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరాజన్ సరోజనమ్మ సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. తాను సంకల్పించిన ధర్మ స్థలం భవనం పూర్తి కావడం ఎంతో సంతోషంగా ఉందని సరోజనమ్మ అంటున్నారు.



బోధన్‌లో నిర్మించిన ధర్మ స్థలం భవనం

మానసిక క్షోభను ప్రత్యక్షంగా చూసి..

పొట్ట కూటి కోసం వందలాది నిరుపేద కుటుంబాలు పట్టణానికి వలస వచ్చి అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. వీరిలో కుటుంబ సభ్యుడు మరణిస్తే అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు ఎక్కువ శాతం ఇంటి యాజమానులు అనుమతి ఇవ్వడం లేదు. ఇలాంటి విషాదకర పరిస్థితుల్లో ఆ కుటుంబసభ్యులు పడే మానసిక క్షోభను ప్రత్యక్షంగా చూసిన సరోజనమ్మ మనస్సు కలిచివేసింది. ఇందుకు పరిష్కారం చూపేందుకు ధర్మ స్థలం భవన నిర్మాణం చేపట్టారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్ దాము ఆమెను ప్రోత్సహించి అండగా నిలిచారు.

క్లుప్తంగా

10న విశ్రాంత ఉద్యోగుల దీక్షను సక్సెస్ చేయాలి



నిజామాబాద్ నాగారం : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఏప్రిల్ 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన దీక్షను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మామిడ్యాల రవీందర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఖలీల్‌వాడిలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక న్యాయపూరిత సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 10న సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భోజాగౌడ్, జిల్లా కోశాధికారి పి.ఆశయ్య, ఉపాధ్యక్షులు జి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు స్వామి దాస్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘ముదిరాజ్‌ల బహిష్కరణ వాస్తవం కాదు’

నిజామాబాద్ నాగారం : వేల్పూర్ మండలంలోని రామన్నపేట్‌లో ముదిరాజ్‌ల బహిష్కరణ వాస్తవం కాదని గ్రామ సంరక్షణ కమిటీ సభ్యులు రాజరావు లింబాద్రి, శోభన్, రత్నయ్యలు అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడారు. ముదిరాజ్‌లను కమిటీ కుల బహిష్కరణ చేశారని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని అబద్దాలు మాట్లాడడం జరిగిందన్నారు. గ్రామంలో కుల బహిష్కరణ లేదన్నారు. సమావేశంలో సభ్యులు వేణు, సాయన్న, సాకలి నారాయణ, సురేష్‌గౌడ్, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోలో ‘ఎక్సైజ్’ లొల్లి

- డ్రెస్‌కోడ్ ఉన్న సభ్యులకు సభ్యత్వంపై చర్చ

ఖలీల్‌వాడి : టీఎన్జీవోస్‌లో డ్రెస్ కోడ్ గొడవ ప్రస్తుతం యూనియన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టీఎన్జీవోలో డ్రెస్‌కోడ్ ఉన్న వారికి సభ్యత్వం ఇవ్వకూడదనే బైలా ఉండగా ఎక్సైజ్ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి టీఎన్జీవోలో సభ్యత్వం కలిగి ఉండడాన్ని పలువురు అభ్యంతరం తెలుపుతున్నారు. అటు ఎక్సైజ్ యూనియన్‌లో కొనసాగుతూ ఇటు టీఎన్జీవోలో కూడా కొనసాగడంపై చర్చ జరుగుతోంది. అలాగే టీఎన్జీవోలో పదవిని చూపుతూ ఎక్సైజ్‌లో ఆయన విధులకు హాజరు కావడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎక్సైజ్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి, ఎన్నికలు నిర్వహించిన తర్వాతే టీఎన్జీవోస్‌కు వెళ్లేందుకు అవకాశం ఉంది. కాని ఎలాంటి తతంగం లేకుండానే టీఎన్జీవో చలామణి అవుతుండడం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని చర్చ జరుగుతోంది.

రేపు కుస్తీ అండర్-17లో ఎంపిక పోటీలు

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ జిల్లా కుస్తీ సంఘం ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల విభాగంలో ఈనెల 10న జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భక్తవత్సలం, సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో ఉదయం 10.00 గంటలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈనెల 11న హైదరాబాదులోజరగనున్న రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు పంపుతామన్నారు. వివరాలకు 91609 40135, 9550358444 సంప్రదించాలన్నారు.

అకాల విలయం..

- తడిసి ముద్దయిన వరి, మొక్కజొన్న
- దిగుబడిపై ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

బాల్కొండ : ముప్కాల్ మండల పరిధిలో శనివారం తెల్లవారుజామున తేలిక పాటి వర్షం కురుయడంతో ఆరబెట్టిన పంట దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. ప్రధానంగా మక్కలు, పసుపు పంట తడిసింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నరు. ప్రతి ఏడాది పంట దిగుబడులు చేతికందే సమయంలో అకాల వర్షాలు కురువడంతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



నాగంపేట్‌లో వర్షానికి తడిసిన మక్కలపై కప్పిన టార్పాలిన్లు

- బోధన్ డివిజన్‌లో 90 వేల ఎకరాలకు పైగా వరి సాగు
- చేతికొచ్చే దశలో అకాల వర్షం

చి‘వరి’కి కష్టం..

బోధన్ : శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో వర్షం కురిసింది. పంట కోసి, పంట పొలాలు, బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. కొన్ని వారాల క్రితమే కురిసిన వడగండ్ల వానకు ఎడపల్లిలోని పలు గ్రామాల్లో అపారమైన నష్టం ఏర్పడింది. కురిసిన వడగండ్ల వర్షానికి ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతిని రైతులు అపార నష్టాలకు గురయ్యారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, మోస్రా, చందూర్ మండలాల్లో ఈ సారి యాసంగి సీజన్‌లో సుమారు 90 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. అన్నీ చోట్లవారం రోజుల క్రితమే పంట కోతలు ప్రారంభంకాగా, 20 శాతం మేరకు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో 60 శాతం మేరకు పంట కోతలు పూర్తి కాగా పచ్చి ధాన్యాన్ని వ్యాపారులకు క్వింటాలు రూ. 1800 ధరకు అమ్ముకుంటున్నారు.

మాక్లూర్‌లో..



మాక్లూర్ : శనివారం ఉదయం కురిసిన అకాల వర్షానికి కల్లాలపై ఆరబోసి ఉన్న రైతుల వరి ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై ఉంటే ఈ తిప్పలు తప్పేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి నుండి శనివారం తెల్లవారు జామున వరకు మోస్తారుగా కురిసిన అకాల వర్షం వల్ల మండలంలోని కొత్తపల్లి, చిక్లి, గొట్టిముక్కల, డీకంపల్లి, కల్లెడి, గాలిబ్‌నగర్ గ్రామాల్లో రైతులు కల్లాలపై ఆరబోసిన వరి ధాన్యం తడిసి పోయింది. ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయ్యాయి. రైతులంగా కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్ : కోటగిరి, రుద్రూర్ మండలాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో వరి ధాన్యం తడిచిపోయింది. పంట చేతికి రావడంతో కోత యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు పొలం సమీపంలో, రహదారుల పక్కన, మైదాన ప్రాంతాల్లో ధాన్యం ఎండబెడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత అకస్మాత్తుగా వచ్చిన వర్షానికి పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. శనివారం ఉదయం తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు.



రుద్రూర్‌లో వడ్లలో ఉన్న నీళ్లు తీసేస్తున్న రైతు

నేలకొరిగిన వరిపైరు..

- 1500 ఎకరాల్లో వరిపంటకు నష్టం

ఎడపల్లి(బోధన్) : అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దయిపోగా పంట మొత్తం నెలకొరిగింది. దీంతో నాలుగు నెలలుగా పంటనే నమ్ముకున్న రైతులు శనివారం ఉదయం కురిసిన వర్షాలకు లబోదిబోమంటున్నారు. శనివారం ఉదయం కురిసిన వర్షాలకు ఎడపల్లి మండంలో వందల ఎకరాల్లో వరికి నష్టం ఏర్పడింది. మండలంలోని 12,652 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం మంది రైతులు వరి కోతలు చేసినట్లు వ్యవసాధికారులు పేర్కొన్నారు. మండలంలో 1000 ఎకరాల వరి ధాన్యాన్ని ఇప్పటికే రైతులు దళారులకు అమ్మేశారు. 1500 ఎకరాల్లో పంటను కోసి రైతులు కల్లాలపై ఆరబెట్టారు. అకాల వర్షాలకు ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు వరి పంటపై ఎలాంటి తాటిపత్రిలు అమర్చకపోవడంతో క్షణాల్లోనే ఆరబెట్టిన వరి పంటలోకి నీళ్లు వచ్చేశాయి. దీంతో రైతులు నీటి బయటకు పంపించేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతా రైతులు ధాన్యాన్ని ఆరుబయటే కాపాడడం కష్టంగా మారింది. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం కూడా నష్టానికి కారణంగా మారింది. దళారులు క్వింటాలుకు రూ.17,00 కొనుగోలు చేస్తున్నారు.



నీటిని తొలగిస్తున్న రైతులు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఎడపల్లి మండలంలో వరికోతలు ముందస్తుగా రావడం సుమారు 20 శాతం వరకు వరికోతలు కూడా రైతులు చేసి ధాన్యాన్ని ఆరబెట్టారు. శనివారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయింది. వరి పంటకూడా నెలకొరిగింది. సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– సిద్ధిరామేశ్వర్, మండల వ్యవసాయ అధికారి



ఎడపల్లిలో ధాన్యం కుప్పలోకి వచ్చిన వర్షం నీరు

కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తుంది. అనేక మంది రైతుల ధాన్యం అరబెట్టటం పూర్తయి పాలితీన్ పట్టలు కప్పి సిద్ధంగా ఉంచి కొనుగోలు కేద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. మరికొంత మంది రైతుల ధాన్యం ఆరబెట్టే క్రమంలో రాత్రి కురిసిన వర్షానికి తడిసిపోయింది.

– ఎర్రన్న, రైతు డీకంపల్లి

ఏర్పాటు చేస్తాం

మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమై కల్లాల వద్ద ధాన్యం సిద్ధంగా ఉన్న విషయం తెలుసు. ఈ విషయమై జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం. అధికారుల నుండి తగిన ఆదేశాలు వచ్చిన వెంటనే మండలంలోని అన్ని గ్రామాల్లోను రైతుల సౌకర్యార్థం కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

– సంతోష్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి మాక్లూర్

పార్టీ కార్యకర్తలే నా బలగం

- బీజేపీ నాయకులను తరిమికొట్టాలి
- ఆత్మీయ సమ్మేళనంలో ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : మత విద్వేషాలను రెచ్చగొట్టి, సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాలతో పబ్బం గడుపుకునే బీజేపీ నాయకులను ప్రజలు తరిమికొట్టాలని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. కన్నతండ్రిలా ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలందరూ కంటికి రెప్పలా కాపాడుకోవాలని బాజిరెడ్డి కోరారు. మండలంలోని బర్ధిపూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం డిచ్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. నా బలం సీఎం కేసీఆర్ అయితే నా బలగం పార్టీ కార్యకర్తలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు మంజూరు చేయకుండా అడ్డుపడుతున్న ప్రధాని మోదీ ఇక్కడికి వచ్చి వందేభారత్ రైలును ప్రారంభించడం సిగ్గు చేటన్నారు. ఈడీ, మోదీ, సీబీఐ బెదిరింపులకు, కవితను అరెస్టు చేస్తామని అంటే సీఎం కేసీఆర్ భయపడడన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తాగునీటికి దిక్కులేదని విమర్శించారు. తల్లికోడి తన పిల్లలను రెక్కల కింద దాచుకుని కాపాడుకున్నట్టు బీఆర్ఎస్ కార్యకర్తలను తాను కాపాడుకుంటానని, ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. అంతకు ముందు పార్టీ జిల్లా ఇన్‌చార్జి మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ ప్రధాని పదవిలో ఉండి తనను చంపడానికి సుపారీ ఇచ్చారంటూ చెప్పుకున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఈ సమ్మేళనంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సాయిలు, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, తారాచంద్‌నాయక్, రామకృష్ణ, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పోతుల మహేందర్ ఏప్రిల్ 2 నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మహేందర్ ఆటో నడుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ 2న ఆటో మెకానిక్ కోసం ఇంటి నుంచి వెళ్లాడు. ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. శనివారం ఆయన భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.



పోతుల మహేందర్(ఫైల్)

వివాహిత..

కామారెడ్డి క్రైం : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని ప్రసాద్ శనివారం తెలిపారు. సింగ జోగి రమేశ్ భార్య ముత్తెమ్మకు ఈనెల 7న రాత్రి 8 గంటల ప్రాంతంలో పక్కింటి వ్యక్తి చిన్నతో గొడవ జరిగింది. అనంతరం ఆమె బయటకు వెళ్లిపోయింది. ఆమె భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ఆటో ఢీకొని ఒకరు..
- బైక్ అదుపుతప్పి మరొకరు..



గాయపడ్డ క్షతగాత్రులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి శివారులోని కామారెడ్డి- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. లింగంపేట్ మండలానికి చెందిన పటేల్ దేవరాజు(36), నరేష్, షేక్‌బాబు కలసి బైక్‌పై కామారెడ్డి నుంచి లింగంపేట్ వైపు వెళ్తున్నారు. బ్రహ్మాజివాడికి చెందిన సిద్దయ్య తన పాసింజర్ ఆటోను తాడ్వాయి నుంచి బ్రహ్మాజీవాడికి వస్తున్నాడన్నారు. ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొట్టిందన్నారు. దీంతో ఆటో డ్రైవర్‌తో పాటు బైక్‌పై వస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పటేల్ దేవరాజు అనే వ్యక్తి మృతి చెందిన ట్లు గ్రామస్తులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్ అదుపుతప్పి యువకుడు..

డిచ్‌పల్లి : రోడ్డుపై ఆరబోసిన మక్కల వల్ల ఒక నిండు ప్రాణం బలైంది. నర్సింగాపూర్ (కొత్తపేట్) గ్రామంలో విషాదం నింపిన ఈ ఘటన డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. డిచ్‌పల్లి ఎస్సై కే.గణేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట్ గ్రామానికి చెందిన అయ్యవారి దేవిదాస్ (36)కు భార్య లావణ్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం గల్ఫ్‌లోని దుబాయ్‌కు వెళ్లిన దేవిదాస్ అనారోగ్యం కారణంగా సెలవు తీసుకుని స్వగ్రామానికి వచ్చాడు. ఆరోగ్యం కుదుట పడటంతో వచ్చే శుక్రవారం తిరిగి దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఖిల్లా డిచ్‌పల్లి లోని అమ్మమ్మ ఇంటికి శుక్రవారం వెళ్లాడు. తిరిగి రాత్రికి కొత్తపేట్‌కు తన బైక్‌పై బయలుదేరాడు. గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం సమీపంలోకి రాగానే రోడ్డుపై ఆరబోసిన మక్కల వల్ల బైక్ అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆటోలో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కొత్తపేట్ సర్పంచ్ నర్సయ్య, గ్రామస్తులు కోరుతున్నారు.



దేవిదాస్ (ఫైల్)

అమెరికాలో ఎల్లారెడ్డికి చెందిన మహిళ మృతి

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సిద్దుల రాధ (52) అనే మహిళ అమెరికాలోని న్యూజెర్సీలో ఈ నెల 5న రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. న్యూజెర్సీలో కూతురు డెలివరి కావడంతో మనవడిని చూసేందుకు అమెరికాకు మూడు నెలల క్రితం వెళ్లిందన్నారు. ఈనెల 5న రాత్రి ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. న్యూజెర్సీలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. ఆమె మృతదేహం ఆదివారం హైదరాబాద్‌కు రానుండగా సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మినీ బస్సు ఢీకొని వృద్ధుడు..

మాచారెడ్డి : మండలంలోని గజ్యా నాయక్ తండా చౌరస్తాలో రోడ్డు పక్కన చెట్టు కింద కూర్చున్న చల్లా గంగారాం(75) మినీ బస్సు ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ వాహనంలో చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సంతోష్ పేర్కొన్నారు.

ఊరికో చరిత్ర..

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి ప్రాంతాన్ని అతి ప్రాచీన కాలంలో అశ్మక రాజ్యంగా పేర్కొన్నారు. విష్ణుకుండినులు మొదలైన వారెందరో ఈ ప్రాంతాన్ని పాలించారు. 15వ శతాబ్దం నుంచి గోల్కొండను పాలించిన బహమనీ సుల్తానుల ఆధిపత్యంలో దోమకొండ సంస్థానాధీశులు పాలించారు. ఈ ప్రాంతాన్ని దాదాపు 500 ఏళ్ల పాటు పాలించిన దోమకొండ సంస్థానాధీశుల పేర్లతో ఎన్నో గ్రామాలు వెలిశాయి. కామారెడ్డి ప్రభువు పేరుతో కామారెడ్డి, ఈ సంస్థాన పాలకురాలు రాజవ్వ పేరుతో రాంజపేట గ్రామాలు వెలిశాయి. రామారెడ్డి పేరుతో రథాల రామారెడ్డి, కాచారెడ్డి పేరుతో కాచాపురం, జంగమరెడ్డి పేరుతో జంగంపల్లి, విస్సారెడ్డి పేరుతో విసన్నపల్లి, తిప్పారెడ్డి పేరుతో తిప్పాపురం, ఎల్లారెడ్డి పేరుతో ఎల్లారెడ్డి, అడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివరెడ్డి పేరుతో సదాశివనగర్, మల్లారెడ్డి పేరుతో మల్లారెడ్డి.. ఇలా పలు గ్రామాలకు సంస్థానాధీశుల పేర్లు పెట్టారు.

నాటి కోడూరు.. నేటి కామారెడ్డి..



కామారెడ్డి పట్టణ చరిత్రకు సాక్ష్యం కోడూరి ఆంజనేయ ఆలయం

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో తూర్పు భాగాన ఉన్న కిష్టమ్మ గుడి, కోడూరు ఆంజనేయ స్వామి ఆలయాల చరిత్ర ఆధారంగా ఆ ప్రాంతంలో కోడూరు అనే గ్రామం ఉండేదని తెలుస్తోంది. అప్పట్లో ప్లేగు వ్యాధి ప్రబలడంతో ప్రజలు అక్కడి నుంచి ప్రస్తుతం పెద్ద బజారుగా పిలిచే ప్రాంతానికి వలస వచ్చారు. కాలక్రమంలో కోడూరు కనుమరుగైంది. 15వ శతాబ్దంలో భిక్కనూరు కేంద్రంగా పరిపాలించిన కామినేని వంశ పాలకుల్లో రెండో కామిరెడ్డి ఈ గ్రామాన్ని పునరుద్ధరించాడు. ఆయన పేరు మీదుగా కామిరెడ్డిపేటగా వెలిసింది. తర్వాతి కాలంలో కామిరెడ్డిపేట కామారెడ్డిపేటగా ఆ తరువాత కామారెడ్డిగా మారింది. నిజాం రికార్డుల్లో కామారెడ్డి పేట అని ఉండేది.

కామినేని పాలకుల గడికోట...



దోమకొండ గడికోట కేంద్రంగా కామినేని వంశీయులు నాలుగున్నర శతాబ్దాల పాటు ఈ ప్రాంతాన్ని పాలించారు. బహమనీ రాజ్యంలో రాచుళ్ల గోత్రానికి చెందిన కాచారెడ్డి కర్ణాటక రాయదుర్గం అధికారిగా ఉండేవాడు. ఆయనను భిక్కనూరు పాలకుడిగా నియమించారు. ఈ వంశంలో కామిరెడ్డి గొప్పపాలకుడిగా, సాహిత్య పోషకుడిగా ప్రసిద్ధుడు. అతడు తన గురువు, కుటుంబ సభ్యుల పేర్ల మీదుగా ఊళ్లు, చెరువులను నిర్మించారు. దోమకొండలో కోటను నిర్మించి అక్కడి నుంచే పాలన సాగించారు. చివరి పాలకుడైన సోమేశ్వరరావు కాలంలో దోమకొండ సంస్థానం నిజాం రాజ్యంతో పాటు భారత్‌లో విలీనమైంది. కామినేని వారసుడైన అనిల్ కామినేని కూతురు ఉపాసన, సినీ నటుడు రాంచరణ్ తేజ వివాహ నిశ్చితార్థం ఈ కోటలోనే నిర్వహించారు.

జప్తుతో ఊరికి పేరు..

నాగిరెడ్డిపేట మండలంలోని జప్తి జాన్కంపల్లి ఊరి పేరు వెనకాలా ఓ చరిత్ర ఉంది. మొట్టమొదట జానకమ్మ అనే మహిళ గ్రామంలో నివాసం ఏర్పరచుకోవడంతో జానకంపల్లి అనే పేరు వచ్చింది. అప్పట్లో ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఈ ఊరుండేది. అప్పట్లో కరువు కారణంగా పంటలు సరిగ్గా పండకపోవడంతో ఎవరూ పన్నులు చెల్లించవద్దని గ్రామస్తులంతా నిర్ణయించుకున్నారు. దీంతో పటేల్ పట్వారి వ్యవస్థకు సంబంధించిన అధికారులు గ్రామంలోని భూములన్నింటినీ జప్తు చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులకు, అధికారులకు మధ్య ఘర్షణలు జరిగాయని, ఓ అధికారిని గ్రామ శివారులో గ్రామస్తులు సజీవ సమాధి చేశారని ప్రచారం ఉంది. గ్రామంలోని ఇళ్లను, భూములను జప్తు చేయడం వల్ల ఆ గ్రామానికి జప్తి జాన్కంపల్లి అనే పేరు వచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు.



రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వెళ్తుండగా ప్రమాదం





ప్రమాదంలో గాయపడ్డ సాయిలు, లింగన్న

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన జూకంటి సాయిలు, లస్మాయొల్ల లింగన్న, గాండ్ల బుచ్చన్న శనివారం బర్ధిపూర్ శివారులోని అమృతగార్డెన్ లో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత మధ్యాహ్నం ముగ్గురు బైక్‌పై దూస్‌గాం గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల వద్ద వీరి బైక్‌ను మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన సాయిలు, లింగన్నకు తీవ్రగాయాలు కాగా బుచ్చన్న స్వల్పంగా గాయపడ్డారు. వెనకే వస్తున్న బీఆర్ఎస్ నాయకులు వెంటనే గాయపడిన క్షతగాత్రులను ఆటోలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

వీరిలో సాయిలు పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, దాసరి లక్ష్మీనర్సయ్య ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యులతో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.